క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అప్పరాల, రామకృష్ణాపురం, పామాపురం, నాటవెల్లి, కనిమెట్ట గ్రామాల పెద్దలను కలిసి ఆహ్వానపత్రికలు అందజేశారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెంటన్నయాదవ్, శంకర్‌యాదవ్, బొర్ర కృష్ణయ్య, డోలు మన్యం, బాలకొండయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



ఆత్మకూర్: పట్టణంలోని బీసీ కాలనీలో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఏడురోజులుగా జరిగి పోటీల్లో 26 జట్లు తలపడ్డాయి. మొదటి విజేత మూలమళ్ల జటుక్టు రూ.10 వేలు నగదును బీజేపీ రాష్ట్రనాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, రెండో బహుమతిని సాధించిన మినీ స్టేడియం జట్టుకు కొత్తూరు నర్సింహ రూ.5 వేల నగదును, షీల్డులను బహూకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్, నాయకులు బోరెల్లి రాము, వెంకట్రాములు, సూరి, డాన్స్ మాస్టర్ బాలు, కురుమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కొత్తకోట రూరల్: మండలంలోని అడబాకులలో గల స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ధ్వజారోహణం, సాయంత్రం భేరీపూజ, దేవతా ఆహ్వానం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు సంతోష్ తెలిపారు. ఆలయంలో జరుగుతున్న పూజ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గ్రామ ప్రజలతో పాటు వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.26 లక్షలు మంజూరు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.26 లక్షలు మంజూరు చేయించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ తెలిపారు. ఎస్సీ కాలనీలో సరైన రోడ్డు వసతి లేక కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద డబ్బులను మంజూరు చేయించారని, సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీలను నిర్మిస్తామని ఆయన తెలిపారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి గ్రామంలోని పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు కొత్తకోటకు ఎమ్మెల్యే జీఎమ్మార్ రాక

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సోమవారం మండలంలోని గ్రామాలకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు శ్రీకృష్ణ ఆలయం వద్ద సీసీ రోడ్డుకు భూమిపూజ, అదేవిధంగా సమీపంలో ఉన్న వాల్మీకి గుడి వద్ద కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం భూమిపూజ చేయనున్నారు. అనంతరం 11గంటలకు బాలుర పాఠశాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి రజక సంఘం నూతన కమ్యూనిటీ భవవానికి పూజ చేయనున్నారు.

మధుమేహ పరీక్షలు

పాన్‌గల్: కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆదేశానుసారం సోమవారం నుంచి మండలంలో మిషన్ మధుమేహ (షుగర్) వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్లు పైబడిన వారందరికీ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్య సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పత్తాలేని పట్నం బస్సు



హైదరాబాద్ వెళ్లేందుకు బస్టాండులో నిలిపిన తుఫాన్ వాహనం

- గతంలో మండలం మీదుగా హైదరాబాద్‌కు నాలుగు బస్సులు
- ప్రస్తుతం ఒక్కటి కూడా నడవట్లే
- ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వాహనాల్లోనే పయనం

ఖిల్లాఘనపురం: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రంతో పాటు మహబూబ్‌నగర్, హైదరాబాద్ నగరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వారిని దృష్టిలో పెట్టుకొని వనపర్తి డిపో నుంచి ఆర్టీసీ అధికారులు గతంలో మండల కేంద్రం మీదుగా హైదరాబాద్‌కు నాలుగు బస్సులను నడిపేవారు. మండల కేంద్రానికి జాతీయ రహదారి కేవలం 13 కిలో మీటర్ల దూరంలో ఉండటం.. అక్కడి నుంచి హైదరాబాద్ 90 కిలో మీటర్ల దూరం ఉండటంతో స్థానికంగా వివిధ పనులు చేసేవారు సైతం తమ పిల్లల చదువు కోసం కుటుంబాలను హైదరాబాద్‌లో ఉంచి ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. మరికొందరు హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసే వారు సైతం బస్సు సౌకర్యం ఉన్న రోజుల్లో రెండు మూడు రోజులకోసారి గ్రామాలకు వచ్చి వెళ్తుండేవారు. నేడు మండలం మీదుగా ఒక్క బస్సు కూడా హైదరాబాద్‌కు ఆర్టీసీ వారు నడపకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో నాలుగు బస్సులు

వనపర్తి ఆర్టీసీ డిపో నుంచి ఖిల్లాఘనపురం మండల కేంద్రం మీదుగా గతంలో ఉదయం 7:30, 8:30, 9:30, మధ్యాహ్నం 3గంటలకు మండలం నుంచి వయా జడ్చర్ల మీదుగా హైదరాబద్‌కు నాలుగు బస్సులు వెళ్లేవి. మూడు బస్సులు సాయంత్రం వరకు తిరిగి రాగా ఒక బస్సు అక్కడే రాత్రికి ఉండి మరుసటి రోజు ఉదయాన్నే మండలం మీదుగా వనపర్తికి వెళ్లేది. ప్రతి బస్సులో ప్రయాణికులు నిండుగా వెళ్లేవారు. తర్వాత వాటిని తగ్గిస్తూ చివరకు ఒక్క బస్సును మాత్రం నడిపేవారు. ఏం జరిగిందో తెలియదు గాని తరువాత ఉన్న బస్సును నిలిపివేశారు. ఇటీవల ఎమ్మెల్యే మేఘారెడ్డి సల్కెలాపురం మీదుగా ఓ బస్సును హైదరాబాద్ నడపాలని చెప్పడంతో కొన్ని రోజులు నడిపారు. తరువాత రావడం లేదని మండల ప్రజలు తెలిపారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

ఆర్టీసీ వారు వనపర్తి డిపో నుంచి మండలం మీదుగా హైదరాబాద్‌కు బస్సులను నిలిపివేయడంతో మండల ప్రజలు హైదరాబాద్ వెళ్లేందుకు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాల్లో ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. కిందరు మహబూబ్‌నగర్ వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్తున్నారు. కొందరు వ్యక్తులు ప్రత్యేకంగా తుఫాన్ వాహనాలను ఆర్టీసీ బస్టాండులో లైనుకు పెట్టి ప్రతిరోజు హైదరాబాద్‌కు ప్రయాణికులను తరలిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి కనీసం ఉదయం ఒకటి, మధ్యాహ్నం ఒక బస్సు చొప్పున హైదరాబాద్‌కు నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

హైదరాబద్‌కు బస్సులు నడపాలి



మండల కేంద్రం నుంచి ప్రతి రోజు వందల మంది హైదరాబాద్‌కు వివిధ పనుల కోసం వెళ్తుంటారు. గతంలో నాలుగు బస్సుల మంచి ఆక్యుపెన్సీతో నడిచేవి. కానీ వాటిని ఎందుకు రద్దు చేశారో తెలియందు. కనీసం జిల్లా కేంద్రం నుంచి మండలం మీదుగా రెండు బస్సులైనా నడపాలి. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు.

– హరికుమార్, ఖిల్లాఘనపురం

కొత్త బస్సులు వచ్చిన వెంటనే..

ప్రస్తుతం డిపోలో బస్సుల కొరత ఉంది. ఉన్న రూట్లకు బస్సులు సరిపోవడం లేదు. డిపోకు కొత్తగా బస్సులు ప్రభుత్వం కేటాయిస్తే ఖిల్లాఘనపురం మండలం మీదుగా హైదరాబాద్‌కు బస్సు నడిపేందుకు ఆలోచిస్తాం.

– వేణుగోపాల్, డీఎం, వనపర్తి డిపో

‘వర్గీకరణ ఉద్యమంతో సత్తా చాటుదాం’



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

వీపనగండ్ల: మాదిగల ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధన కోసం నిర్వహించనున్న వేల గొంతులు లక్ష డప్పుల మహాసాంస్కృతిక ప్రదర్శన విజయవంతం చేసి మాదిగల సత్తా చాటాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మహాప్రదర్శనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న ద్వంద వైఖరిని ఎండగట్టేందుకు ఈ నెల 7న చలో హైదరాబాద్ పేరుతో నిర్వహిస్తున్న మహాప్రదర్శన కార్యక్రమంలో వేలాదిమంది మాదిగలు పాల్గొని ఐక్యమత్యతను చాటాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మొలకపల్లి నాగరాజు, దేవని రమేష్, మీసాల శ్రీను, రమేష్, రామకృష్ణ, విష్ణు, ప్రవీన్, కృష్ణ, రాజశేఖర్, గంగారాం, కరుణాకర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి చికిత్స శిబిరం

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాలలో మిత్ర కంటి ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయినట్లు నిర్వాహకులు డాక్టర్ నాగంజనేయులు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 135కి పైగా కంటి పరీక్షలు చేయించుకోగా.. అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పలువురికి ఆపరేషన్ కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్‌చారి, వెంకటేష్, రాములు, అజ్జు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి జములేశ్వరీమాత ఉత్సవాలు



ముస్తాబైన జములమ్మ ఆలయం

అమరచింత: పట్టణ శివారులో వెలసిన జములేశ్వరి మాత ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు సోమవారం భక్త మార్కండేయ ఆలయం నుంచి అమ్మవారి పట్టుచీరతో పాటు నగలను భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. ప్రతి ఏడాది నెల రోజుల పాటు అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో అమ్మవారి ఆలయం వద్ద భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించామన్నారు.

పట్టణం నుంచి ఇతర ప్రాంతాల్లో స్థిరపడి జీవిస్తున్న ప్రతి కుటుంబం అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకుంటున్నారు. పెళ్లిళ్ల సమయంలో జములమ్మకు పాటేళ్లతో మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తులు ఇచ్చిన విరాళాలతో నీడ కోసం షెడ్లు, గదులను నిర్మించినట్లు తెలిపారు.

కరాటేలో ఆత్మకూర్ విద్యార్థుల ప్రతిభ



ఆత్మకూర్: తెలంగాణ ఇంటర్ స్టేట్ చంద్రశేఖర్ మెమోరియల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కరాటే చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఆత్మకూర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆత్మకూర్‌కు చెందిన అరవింద్ గోల్డ్ మెడల్‌తో పాటు చాంపియన్‌షిప్ కప్ సాధించాడని కరాటే మాస్టర్ నరేందర్‌స్వామి తెలిపారు. అలాగే సాయిగణేష్, గౌరీశంకర్, భవ్యశ్రీ, రమ్యశ్రీ, ఇంతియాజ్, రంజిత్, ఉమేష్, యశ్వంత్ గోల్డ్ మెడల్ సాధించగా.. అక్షిత సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు.

పాన్‌గల్ ఈదమ్మ జాతరకు ఏర్పాట్లు



ఆలయంలో కొలువుదీరిన ఈదమ్మ



ముస్తాబైన ఈదమ్మ గుడి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఈదమ్మ జాతర మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పూజారి నాగన్న ఆదివారం తెలిపారు. అమ్మవారి జాతర రెండు రోజుల పాటు జరుగుతుందని మొదటి రోజు షిడే, రెండో రోజు పోలారం బండ్లు, బోనాలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. జాతరకు మండలంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవారి గుడి వద్ద పలు మిఠాయిలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. ఉత్సవాల కోసం గుడిని ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామ పంచాయతీ, గుడి కమిటీ సభ్యుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

ఆనంద్‌కు సత్కారం



ఆత్మకూర్: జాతీయ మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా రాష్ట్రం తరఫున ఆరేపల్లికి చెందిన మత్స్యకారుడు ఏటికాడి ఆనంద్ రాష్ట్రపతి అవార్డు అందుకోవడం గర్వకారణమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో ఎంపీ ఆనంద్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేపల్లిలో పదేళ్లుగా చేప పిల్లను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సబ్సిడీ చేపపిల్లలను ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అశోక్‌జీ, కంభాళపురం రాము, సుధాకర్, నరేందర్ తదితరులు ఉన్నారు.

బడ్జెట్ కేటాయింపులో అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలోని కార్మిక, కర్షక వర్గాలతో పాటు సామాన్యులకు అన్యాయం జరిగిందని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిధుల కేటాయింపులో వివక్ష చూపారని మండిపడ్డారు. ఉపాధికూలీ రోజువారి రూ.600 మేరకు చెల్లించాలని, ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులను చేపట్టాలని ఆందోళన చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంపన్నుల కోసమే కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు కేవలం 2 శాతం నిధులు కేటాయించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్ర వాటా పెంచాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ రమేష్, అజయ్, వెంకటేష్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొత్తకోట రూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న యాదగిరి, కురుమూర్తి తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్–2025లో జరిగిన 38వ తైక్వాండో పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పథకాలు సాధించారు. పథకాలు సాధించిన కానిస్టేబుళ్లను స్థానిక ఎస్‌ఐ ఆనంద్‌తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోయేజ్, సుభాష్, పెంటన్న యాదవ్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు శారీరక ధృడత్వంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, అంతే కాకుండా ఉద్యోగాల్లో రిజర్వేషన్ అవకాశం లభిస్తుందన్నారు.

‘భగవద్గీతతో జ్ఞానం సిద్ధిస్తుంది’

కొత్తకోట రూరల్: సృష్టిలో ప్రథమ గ్రంథం భగవద్గీత అని, ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదివితే జ్ఞానం పెంపొందించుకోవచ్చని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. ఆదివారం పెద్దమందడి మండలంలోని అమ్మపల్లిలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గురువు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు.

5న లేబర్ కోడ్ల అమలుపై కార్మికుల నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

వనపర్తిరూరల్: కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలును ఆపాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి మోష, టీయూసీఐ నాయకులు రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో కార్మికులు దశాబ్దాలుగా పోరాడి కార్మిక చట్టాలను సాధించుకున్నారన్నారు. సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఈ కోడ్‌లను ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇవి అమలైతే కార్మికులు సమ్మె చేసే హక్కు, జీతాలు పెంచమని అడిగే హక్కు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు, రైతులు, సంయుక్త కిసాన్ మోర్చా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, ఉప కార్యదర్శి గోపాలకృష్ణ, రాములు, గణేష్, రమేష్, డంగుకుర్మయ్య పాల్గొన్నారు.

‘మా ప్లాట్లు మాకు కావాలి’



వెంచర్‌లో తమ ప్లాట్లు చూపాలని ఆందోళన చేస్తున్న బాధితులు

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 582లో గల వ్యవసాయ పొలాన్ని వెంచర్‌గా మార్చి ప్లాట్లను స్కీం పద్ధతిన విక్రయించారని, అలాంటి స్థలంలో తమకు కేటాయించిన పత్రాల ప్రకారం ప్లాట్లు చూపించాలని లబ్ధిదారులు ఆదివారం వెంచర్‌లో ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. 25 ఏళ్ల కిందట పట్టణంలోని ఎల్లా సుదర్శన్, ఎల్లా బాలస్వామి తమకు చెందిన సర్వేనంబర్ 582లో గల పొలాన్ని ఇంటి స్థలాల కోసం వెంచర్‌గా మార్చుకున్నారు. వీటిలోని ప్లాట్లను అమ్మేందుకు స్కీం ద్వారా నెలవారీగా డబ్బులు కట్టించుకున్నారు. మొత్తం డబ్బులు ముట్టిన తర్వాత లబ్ధిదారులకు ప్లాట్ విక్రయిస్తున్నట్లు బాండ్ పేపర్లపై రాసిచ్చారని, ప్రస్తుతం తమకు ఒకొక్కరు రూ.లక్ష ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. లబ్ధిదారులు ప్లాట్ల విక్రయ స్థలంలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేసి.. అక్కడే సమావేశం నిర్వహించి తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జీఎస్ గోపి లబ్ధిదారులను కలిసి న్యాయం జరిగే వరకు మద్దతుగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బాధితులు చాకలి వెంకటేష్, ఖాజాహుస్సేన్, షబ్బీర్, చారి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలతో విద్యార్థుల్లో సృజనాత్మకత



విహార యాత్రలో విద్యార్థులు

ఆత్మకూర్: పట్టణంలోని కేపీటీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 60 మంది విద్యార్థులు ఆదివారం విహారయాత్రకు బయలుదేరారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం అనురాధ మాట్లాడుతూ విహరయాత్రలు విద్యార్థులకు సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేస్తాయన్నారు. మహబూబ్‌నగర్‌లోని కలెక్టరేట్, పిల్లలమర్రి ఏకోపార్కు, మ్యూజియం తదితర ప్రదేశాలను చూపించి అవగాహన కల్పించామన్నారు. అలాగే తమ పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన చేపడుతున్నామని, ఇందుకు గాను వలంటీర్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీల అభివృద్ధికే సబ్‌ప్లాన్ నిధులు



మాట్లాడుతున్న సత్యశీలారెడ్డి

గోపాల్‌పేట: ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం ఎస్సీ కాలనీల అభివృద్ధికే కేటాయిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండలాల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు శనివారం జనాభా ప్రాతిపదికన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు సుమారు రూ.పది కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. ఈ నిధులు ఆయా గ్రామాల్లోని ఎస్సీ కాలనీల అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. గోపాల్‌పేట మండలానికి రూ.1.7 కోట్లు కేటాయించారని, తొందర్లోనే ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంకా పరిశీలన జరుగుతోందని, అర్హులను గుర్తించి మొదటి దఫాలో స్థలం ఉండి ఇల్లు లేని వారికి లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. అలాగే ఆత్మీయ భరోసా కోసం భూమి లేకుండా జాబ్‌కార్డులు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో మండలంలో ప్రభుత్వం భూముల ఆక్రమణ జరయ్యాయని, ప్రభుత్వం వాటిపైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటేష్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు పర్వతాలు యాదవ్, శేఖర్, బాలయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ కొంకి రమేష్, బాలపీరు, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల ఎస్సీ వాడల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.2.60 కోట్లు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, సింగల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, మండల నాయకులు ఆగారం ప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో ఎస్సీ వాడల్లో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. మండలంలోని తిర్మలాయపల్లి గ్రామానికి రూ.7.5 లక్షలు, సల్కెలాపురం రూ.15 లక్షలు, మానాజీపేట రూ.15 లక్షలు, వెంకటాంపల్లి రూ.10 లక్షలు, ఖిల్లాఘనపురం రూ.24.5 లక్షలు, ఆగారం రూ.5 లక్షలు, మల్కిమియాన్‌పల్లి రూ.10 లక్షలు, కమాలోద్దీన్‌పూర్ రూ.10 లక్షలు, మల్కాపూర్ రూ.7.5 లక్షలు, అల్లమాయపల్లి రూ.10 లక్షలు, అప్పారెడ్డిపల్లి రూ.10 లక్షలు, సోళీపురం రూ.15 లక్షలు, రుక్కన్నపల్లి రూ.5 లక్షలు, షాపురం రూ.15 లక్షలు, పర్వతాపురం రూ.10 లక్షలు, సూరాయిపల్లి రూ.5 లక్షలు, ఉప్పరిపల్లి రూ.15 లక్షలు మంజూరయినట్లు నాయకులు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో అబ్దుల్ రహీం గంధోత్సవం

మదనాపురం: కులమతాలకతీతంగా జరిగే అబ్దుల్ రహీం ఆరాధన ఉత్సవాలు మండలంలోని దుప్పల్లిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దర్గాను దర్శించుకుంటారు. ఉర్సు ప్రధాన ఘట్టమైన గంధోత్సవం ఆదివారం రాత్రి దర్గా నుంచి భక్తులు గంధాన్ని తలపై పెట్టుకొని ఊరేగింపుగా తీసుకెళ్లి మహబుబ్‌సుబాని దర్గాకు సమర్పించారు. ఈ వేడుకకు తాండూర్ సయ్యద్ అబ్దుల్ కరీం దర్గా పీఠాధిపతులు సయ్యద్‌సాబేర్ పాష, అజిష్ పాష అతిథులుగా హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో 2008–09 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 16ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు, గురువులు ఆప్యాయంగా పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు గౌసు, కొండారెడ్డి, దశరథరెడ్డి, నారాయణరెడ్డి, సుధీర్‌రెడ్డి, మధుసూదన్‌రావు, వరప్రసాద్, ఉమాదేవి, పావని, సుమలత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఈదమ్మ తల్లి ఆలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలిగించాలని భక్తులు కోరుతున్నారు. ఈదమ్మ ఉత్సవాలకు మూడు వారాల ముందుగా ఆనవాయితీగా నిర్వహించే గావ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ పూజాకార్యక్రమానికి హాజరైన భక్తులు, గ్రామస్తులు ఆలయానికి వెనుక భాగాన ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ఉత్సవాల సమయంలో భక్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చేసేది లేక ఒకరి వెనుక ఒకరు అమ్మవారి ఆలయం చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారన్నారు.

మంచిర్యాలకు జిల్లా రగ్బీ జట్టు

వనపర్తి: మంచిర్యాలలో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్టు ఆదివారం బయలుదేరిందని వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ హాఫీజ్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎండీ జబ్బార్ పాల్గొన్నారు.

